
బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 22 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## నవంబర్ 27న ఐపీఎల్ 2026 మినీ వేలం

- బరిలో 277 మంది క్రికెటర్లు.. 73 మందికి మాత్రమే అవకాశాలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాబోయే ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన ఆటగాళ్ల మినీ వేలం ఈ నెల 27న న్యూఢిల్లీలో నిర్వహించనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. వేలంలో పాల్గొనే క్రికెటర్ల తుది జాబితాను శుక్రవారం విడుదల చేసింది.

ఈసారి మినీ వేలంలో మొత్తం 277 మంది క్రికెటర్లు బరిలో నిలుస్తున్నారు. వీరిలో 194 మంది భారత క్రికెటర్లు, 52 మంది క్యాప్డ్ ప్లేయర్లు,142 మంది అన్ క్యాప్డ్ ప్లేయర్లు, 66 మంది విదేశీ క్యాప్డ్ ప్లేయర్లు, 17 మంది విదేశీ అన్ క్యాప్డ్ ప్లేయర్లు అందువల్ల మొత్తం 83 విదేశీ ఆటగాళ్లు కూడా వేలంలో ఉండనున్నారు.

అయితే 10 ఫ్రాంచైజీలు కలిపి ఈ మినీ వేలంలో మొత్తం 73 మంది క్రికెటర్లను మాత్రమే కొనుగోలు చేయనున్నాయి.

## అమల్లోకి నాలుగు కొత్త లేబర్ కోడ్‌లు

- కేంద్ర ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశంలోని 29 పాత కార్మిక చట్టాలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లు అధికారికంగా అమల్లోకి వచ్చాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర కార్మిక శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీతో దేశవ్యాప్తంగా కొత్త లేబర్ నియమావళి అమలు ప్రారంభమైంది. కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ మాట్లాడుతూ, "నాలుగు లేబర్ కోడ్‌లను నోటిఫై చేశాం. ఇవి ఇకపై దేశవ్యాప్తంగా చట్టాలుగా అమల్లో ఉంటాయి" అని ప్రకటించారు.

**కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్‌లు**

వేతనాల కోడ్ – 2019 (Code on Wages 2019)

పారిశ్రామిక సంబంధాల కోడ్ – 2020 (Industrial Relations Code 2020)

సామాజిక భద్రత కోడ్ %– 2020 (Code on Social Security 2020)

వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ – 2020 (Occupational Safety, Health & Working Conditions Code 2020)

మాండవీయా మాట్లాడుతూ, ఈ సంస్కరణలతో కార్మికుల సంక్షేమం మెరుగుపడతుందని, పనిదారులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. దేశీయ పరిశ్రమలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంతో పాటు, మారుతున్న పని విధానాలకు అనుగుణంగా శ్రామిక వ్యవస్థను మార్చడమే ఈ కోడ్‌ల లక్ష్యమని వివరించారు.



**పాత చట్టాల సమస్యలకు ముగింపు**

కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుతానికి అమల్లో ఉన్న పలు కార్మిక చట్టాలు 1930–1950 మధ్యకాలంలో రూపొందించబడినవే. అప్పటి పని విధానం, అప్పటి పరిశ్రమల పరిస్థితులు నేటితో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉండటంతో, పాత చట్టాలు కాలం చెల్లినవిగా మారాయని తెలిపింది. ప్రపంచంలోని అనేక దేశాలు కార్మిక చట్టాలను సరళతరం చేసి ఏకీకృతం చేస్తున్నప్పటికీ, భారత్ మాత్రం 29 వేర్వేరు చట్టాల సంక్లిష్టతతో ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని గుర్తుచేసింది. కొత్త కోడ్‌లతో ఈ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని విశ్వాసం వ్యక్తం చేసింది.

**అమలు ఎందుకు ఆలస్యం?**

నాలుగు లేబర్ కోడ్‌లకు పార్లమెంటు 2020లోనే ఆమోదం తెలిపింది. అయితే ఆయా కోడ్‌లు అమలులోకి రావడానికి అవసరమైన రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలు నోటిఫై కావడంలో ఆలస్యం జరిగింది. రాష్ట్రాలు తమ తమ నియమాలను సిద్ధం చేయడంతో, చివరకు అన్ని ప్రక్రియలు పూర్తి కాగా, కోడ్‌లు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి.

# రూపాయి చారిత్రాత్మక పతనం

- డాలర్‌తో పోల్చితే 89.61కి క్షీణత
- ఒక్క పూటలోనే 93 పైసలు ఢమాల్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ కుప్పకూలిపోయి ంది. భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో వారాంతంలో 89.61కి పతనమ య్యింది. అమెరికా, భారత్ మధ్య చోటు చేసుకుంటున్న టారిఫ్ ఆందోళనలు, దేశీయ, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి రూపాయి విలువను అగాథంలోకి నెట్టింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భారత ఐటి కంపెనీలకు ప్రతికూల నిర్ణయాలు ఉండొచ్చనే భయాలతో ఐటీ షేర్లు ఒత్తిడిని ఎదుర్కోవడ మూ రూపాయిపైనా ప్రభావం చూపాయి.



శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 93 పైసలు పతనమై 89.61 దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.67 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 89.65 అత్యల్ప స్థాయికి పడిపోయింది. గురువారం సెషన్‌లోనూ 20 పైసలు విలువ కోల్పోయింది. ఇంతక్రితం సెప్టెంబర్ 30న ఇంట్రాడేలో 88.85 కనిష్ఠ స్థాయిని తాకింది. అక్టోబర్ 14న 88.81 ఆల్‌టైం పతనాన్ని చవి చూసింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. ఒకే పూటలో అత్యధికంగా జులై 30న 89 పైసలు క్షీణించింది.

'ఇప్పటి వరకు భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత రాకపోవడం, అంతర్జాతీయంగా మార్కెట్లలో విశ్వాసం సన్నగిల్లింది. క్రిప్టో కరెన్సీల్లో భారీగా అమ్మకాలు తదితర అంశాలు రూపాయిపై ఒత్తిడిని పెంచాయి' అని కోటక్ సెక్యూరిటీస్‌లో కరెన్సీ, రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ పేర్కొన్నారు.

రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం అమాంతం పెరిగిపోనుంది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధుల బయటకు తరలిపోవడం, డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం తదితర పరిణామాలు దేశీయ కరెన్సీని అగాథంలోకి నెట్టుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వారాంతం సెషన్‌లో బీఎస్‌ఈ సెన్సెక్స్ 401 పాయింట్లు లేదా 0.47 శాతం పతనమై 85,232కు జారింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 124 పాయింట్లు లేదా 0.47 శాతం తగ్గి 26,068 వద్ద ముగిసింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఏ స్థాయిలో ఉండాలన్న దానిపై ఏ లక్ష్యం పెట్టుకోలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. గురువారం ఆయన ఓ సమావేశంలో మాట్లాడుతూ.. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లతో తలెత్తిన వాణిజ్య అనిశ్చితి పరిస్థితులతోనే రూపాయి ఒత్తిడికి గురి అవుతుందన్నారు. రూపాయి అనేది ఓ ఆర్థిక సాధనమని, డాలర్లకు డిమాండ్ ఉన్నప్పుడు రూపాయి విలువ తగ్గడం సాధరణమేనని వ్యాఖ్యానించడం గమనార్హం.

## హైదరాబాద్‌కు రాష్ట్రపతి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్ తదితరులు స్వాగతం పలికిన

వారిలో ఉన్నారు. అనంతరం ఆమె రాజ్‌భవన్ చేరుకుని అక్కడే లంచ్ అనంతరం కొద్ది సేపు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ్నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం చేరుకుని అక్కడ భారతీయ కళా మహోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం ఆమె తిరిగి రాజ్‌భవన్ చేరుకుని అక్కడే రాత్రికి బస చేయనున్నారు. శనివారం ఉదయం అక్కడే అల్పాహారాన్ని తీసుకుని ఆమె ఉదయం 9.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి వెళ్లనున్నారు.

## స్పీకర్‌ను కలిసిన కడియం శ్రీహరి



**బలగం టీవీ, హైదరాబాద్**

పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి శుక్రవారం (నవంబర్ 21) శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి మారిన కడియం శ్రీహరి, మరో ఎమ్మెల్యే దానం నాగేందర్‌లకు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిందిగా స్పీకర్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23వ తేదీ లోపు వివరణతో కూడిన అఫిడవిట్‌ను సమర్పించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. స్పీకర్ ఇచ్చిన గడువుకు కొద్ది రోజుల ముందే ఆయనను కలిసిన కడియం శ్రీహరి, తమ వివరణను అందించడానికి మరింత సమయం కావాలని కోరినట్లు సమాచారం. స్పీకర్ ఈ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

ఇక, ఇదే కేసులో నోటీసులు అందుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. ఢిల్లీ నుండి రాగానే ఆయన స్పీకర్‌ను కలవనున్నారు. అయితే, ఆయన కూడా కడియం శ్రీహరి మాదిరిగానే వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కోరతారా, లేక అనర్హత వేటు తప్పదనే అంచనాలతో రాజీనామా చేస్తారా అనే విషయంపై రాజకీయ వర్గాల్లో సందిగ్ధత నెలకొంది.



## దుబాయ్ ఎయిర్ షోలో విషాదం

- కుప్పకూలిన భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దుబాయ్ ఎయిర్ షోలో భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పైలట్ మృతి చెందాడు. భారత వాయుసేనలో వినియోగిస్తున్న యుద్ధ విమానం హెచ్ఏఎల్ తేజస్ భారత కాలమానం ప్రకారం మధ్యా హ్నం సమయంలో ప్రదర్శన చేస్తూ ఒక్కసారిగా నేలను తాకి కూలి పోయింది. దీంతో క్షణాల వ్యవధి లోనే మంటలు చేలరేగి ఫైటర్ జెట్ పూర్తిగా దగ్ధమైంది. దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందినట్టు భారత వైమానిక దళం ధ్రువీకరించింది. ఇందుకు తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణంపై విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది.

## దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్‌కు సీఎం కుట్ర



- హెచ్‌ఎల్‌టీపీ పాలసీ కాదు.. రూ. 5 లక్షల కోట్ల స్కామ్..
- లక్షల కోట్ల విలువైన భూమిని అప్పనంగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పుతున్నది..
- వెంటనే ప్రభుత్వం ఈ పాలసీని రద్దు చేయాలి..
- ఇది కేవలం రేవంత్ రెడ్డి అన్నదమ్ములు అనుచరుల కోసమే తీసుకువచ్చిన పాలసీ
- రేవంత్ అవినీతి కోసం ఇప్పుడు ఇందులో పాలుపంచుకుంటే వాటి రద్దు తప్పదు
- పారిశ్రామికవేత్తలకు కేటీఆర్ హెచ్చరిక
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు సంచలన ఆరోపణ లు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరిట ముఖ్యమంత్రి రూ. 5 లక్షల కోట్ల విలువైన భూకుంభకోణానికి పాల్పడాలని చూస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దీనిని భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణం గా అభివర్ణించిన కేటీఆర్, ఈ విధానం ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే రాజకీయ మధ్యవర్తులు, బంధువులు, రియల్ ఎస్టేట్ గ్రూపులకు లబ్ధి చేకూర్చేందుకే రూపొందించబడిందని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్ఐఎల్‌టీపీ , వాస్తవానికి వేలాది ఎకరాల పారిశ్రామిక భూములను అత్యంత తక్కువ ధరకు బహుళ–ఉపయోగ విలువైన రియల్ ఎస్టేట్‌గా మార్చడానికి రూపొందించబడిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇది కేవలం పాలసీ కాదు. రూ. 5 లక్షల కోట్ల స్కామ్ కోసం రూపొందించిన బ్లూప్రింట్ అని కేటీఆర్ ఆరోపించారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ముసుగులో, రేవంత్ రెడ్డి భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణానికి తెరలేపారు.

బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, అజామాబాద్‌తో సహా హైదరాబాద్‌లోని కీలకమైన పారిశ్రామిక క్లస్టర్‌లలో ఉన్న సుమారు 9,292 ఎకరాల విలువైన భూమిని క్రమబద్ధీకరించడానికి ఈ పాలసీ ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. ఈ భూముల మార్కెట్ విలువ ప్రస్తుతం ఎకరాకు రూ. 40 నుంచి 50 కోట్ల వరకు ఉందని, దీని మొత్తం విలువ రూ. 4 లక్షల కోట్ల నుంచి రూ. 5 లక్షల కోట్ల మధ్య ఉంటుందని అంచనా వేశారు. ఆ భూములను రేవంత్ కేవలం ప్రభుత్వ విలువలో 30% కే అప్పగించాలని చూస్తున్నారు, అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మేము అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు, ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100% నుండి 200% అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశామన్నారు. కానీ కాంగ్రెస్ కేవలం 30% కే చేయాలని చూస్తోంది. ఎందుకు? ఎవరికి లాభం చేకూర్చడానికి? అని ప్రశ్నించారు. మార్కెట్ ధరలు, ఎస్ఆర్ఓ విలువ కంటే నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉన్నాయని ఆయన వాదించారు. కనీసం ఎస్ఆర్ఓను కూడా పూర్తిగా వసూలు చేయడం లేదు. కేవలం 30% మాత్రమే తీసుకుంటున్నారు. మిగిలిన లక్షల కోట్ల రూపాయలు నేరుగా ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తాయి, అని ఆరోపించారు.

ఉద్యోగాల కల్పన, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడానికి చారిత్రకంగా పారిశ్రామిక భూములను చాలా తక్కువ ధరలకు లేదా ఉచితంగా కేటాయించారని కేటీఆర్ చెప్పారు. చాలా సందర్భాల్లో ప్రజల నుంచి భూములను సేకరించి పారిశ్రామికవేత్తలకు అనేక రైతులతో ఇచ్చిన ఈ భూములను ఈరోజు ప్రైవేట్ వ్యక్తుల నది కోసం రెగ్యులరైజ్ చేస్తామంటే కుదరదన్నారు. ఉత్పత్తిని పెంచడానికి, ఉద్యోగాలు సృష్టించడానికి ప్రభుత్వాలు రాయితీ ధరలకే పారిశ్రామిక భూమిని ఇచ్చాయి. అది ఉద్దేశం. కానీ ఇప్పుడు, అవే భూములను ప్రైవేట్ వ్యక్తుల లాభాల కోసం క్రమబద్ధీకరిస్తున్నారు, అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా అనేక మంది భూ యజమానులు, బ్రోకర్లు అత్యంత తక్కువ ధరలకు క్రమబద్ధీకరణ కోసం తనను సంప్రదించారని, అయితే తాము ఆ ప్రతిపాదనలను తిరస్కరించామని కేటీఆర్ వెల్లడించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ ప్రయోజనం కోసం చౌకగా ఇవ్వలేము. మేము అప్పుడు తిరస్కరించాం. కానీ మేము ఆపిన పనినే ఇప్పుడు రేవంత్ చేస్తున్నారు, అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

మిగితా 2వ పేజీలో

## 25న రాష్ట్ర క్యాబినెట్ భేటీ

- స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించే అవకాశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తొమ్మిది రోజుల వ్యవధితో రాష్ట్ర మంత్రివర్గం మరోసారి భేటీ కాబోతోంది. ఈనెల 25న క్యాబినెట్‌ను సమావేశపరిచేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 25న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో 'కొత్త విద్యుత్ కేంద్రాలే' ప్రధాన ఎజెండా కానున్నాయి. రామగుండంలో ఏర్పాటు చేయబోయే 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటు, రంగారెడ్డిజిల్లా ఇబ్రహీంపట్నం వద్ద 750 మెగావాట్లు, యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో మరో 750 మెగావాట్ల బ్యాటరీ ఇంధన నిల్వ సంస్థల ఏర్పాటు, ప్రయివేటు కంపెనీల ఆధ్వర్యంలో నిర్మించబోయే రెండు వేల మెగా వాట్ల పంప్ స్టోరేజీ ప్లాంట్ల నిర్మాణంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోను న్నారు. ఇందుకనుగుణంగా ఎజెండా ఖరారు చేసినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

వీటితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ రెండేండ్ల పాలన, ఆ క్రమంలో నిర్వహించబోయే ఉత్సవాలు, వేడుకలు, తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ తదితరాంశాలపై మంత్రివర్గం మరోసారి చర్చించనుంది. ఇటీవల మహిళా సంఘాలకు పంపిణీ చేసిన చీరెలు, ఆయా సమాఖ్యలకు కేటాయించిన ఆర్టీసీ బస్సులు, వాటి నిర్వహణపై కూడా మంత్రివర్గం సమాలోచనలు చేయనుంది. వీటితోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు, రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలపై కూడా చర్చించనున్నారు. యాదగిరిగుట్ట అభివృద్ధి బోర్డుపై చర్చించి, తగు నిర్ణయం తీసుకోనున్నారని సీఎంవో వర్గాలు తెలిపాయి.

## 'తెలంగాణ-ఈశాన్య' స్పోర్ట్స్ ఫెస్టివల్ ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల స్పోర్ట్స్ ఫెస్టివల్ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన క్రీడా పోటీలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో తొలుత బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన గవర్నర్.. క్రీడాకారులతో కలిసి సరదాగా బ్యాడ్మింటన్ రాకెట్ పట్టుకుని అలరించాడు. గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల బాయ్స్, గర్ల్స్ విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. 'ఈశాన్య రాష్ట్రాలు, తెలంగాణ గ్రామీణ క్రీడల మధ్య సారూప్యత ఉంది. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణ సంబంధాలను క్రీడలు, స్పోర్ట్స్ కల్చర్ మరింత పెంపొందించగలదని' గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈశాన్య రాష్ట్రాలు, తెలంగాణలో క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, శిక్షణ సౌకర్యాలపై క్రీడా పాత్రికేయులు చర్చించారు. మిజోరాం క్రీడాశాఖ మంత్రి లాల్నింగ్లోవా, తెలంగాణ ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, శాట్జ్ చైర్మెన్ శివసేనా రెడ్డి, ఎండీ సోనీబాలదేవి తదితరులు స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలను బెదిరిస్తున్న కేటీఆర్

- మేం తెచ్చిన పాలసీ సొంతభూముల్లో కన్వర్షన్ చార్జీల కోసమే...
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రగతికి అడ్డుపడుతూ, పారిశ్రామికవేత్తల్ని బెదిరించే ధోరణిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు మాట్లాడటం సరికాదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సౌకర్యాల కల్పనా సంస్థ (టీజీఐఐసీ) నుంచి పరిశ్రమల స్థాపన కోసం పారిశ్రామికవేత్తలు గతంలో భూములు కొనుగోలు చేశారని తెలిపారు. కాలక్రమంలో ఆ పరిశ్రమలు జనావాసాల మధ్యకు రావడం, కాలుష్య కారణాలతో అనేక పరిశ్రమలు మూతపడ్డాయని వివరించారు. ఆ భూములు ఇప్పటికీ పారిశ్రామిక జోన్ పరిధిలో ఉన్నాయనీ, వాటిని ఇతర వాణిజ్య, గృహ అవసరాలకోసం వినియోగించుకొనే అవకాశం కల్పిస్తూ, జోన్ మార్పును సూచిస్తూ ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని తెలిపారు. దానికోసం 80 అడుగులు వెడల్పు రోడ్డు ఉన్న భూముల జోన్‌మార్పు కోసం 50 శాతం, అంతకంటే తక్కువ వెడల్పు ఉన్న రోడ్డుకు అనుసంధానంగా ఉన్న భూములకు 30 శాతం మేరకు కన్వర్షన్ కోసం ఇంపాక్ట్ చార్జీలు నిర్ణయించామన్నారు. దీనివల్ల పారిశ్రామికవేత్తలకు, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందనే ఉద్దేశ్యంతోనే ఈ పాలసీ తెచ్చామన్నారు. అంతేతప్ప ఇది భూముల్ని అమ్ముకోవడం కాదని వివరణ ఇచ్చారు. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం అజామాబాద్ సహా పలు పారిశ్రామిక ప్రాంతాల్లోని లీజు భూముల్ని క్రమబద్ధీ కరించేందుకు మూడు జీవోలు తెచ్చిందని గుర్తుచేశారు. మాజీ మంత్రి కేటీఆర్ లీజు భూముల క్రమబద్ధీకరణ, సొంత భూముల కన్వర్షన్‌కు తేడా తెలియని అవివేకి అని విమర్శిం చారు. లక్షల కోట్ల కుంభకోణానికి ప్రభుత్వం పాల్పడుతోం దనీ, దానికోసం సీఎం కుటుం బసభ్యులు ఇప్పటికే ఎంఓయూలు చేసుకున్నారంటూ కేటీఆర్ నోటికొచ్చినట్టు దుష్ప్రచారం చేస్తూ, ప్రజల్లో ఆందో ళన రేకెత్తించాలని ప్రయత్ని స్తున్నారని చెప్పారు. ప్రభుత్వం పరిశ్రమలకు లీజుకిచ్చిన భూములపై యాజమాన్య హక్కు లు కల్పిస్తూ 'ఫ్రీ హెహోల్డ్' రైట్స్ పేరిట 2023 ఆగస్టులో మూడు ఉత్తర్వులు ఇచ్చింది వారి ప్రభుత్వ హయాం లోనేనని స్పష్టం చేశారు. శుక్రవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమా వేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ఆరోపణలను ఆధారాలతో సహా తిప్పికొ ట్టారు. కేటీఆర్ చెప్తున్న 9,292 ఎకరాల భూమిలో పరి శ్రమలకు ప్లాటింగ్ చేసి కేటాయించిన భూమి 4,740 ఎకరాలు మాత్రమేననీ, మిగిలిన భూమి రోడ్లు, డ్రెయినేజి వంటి మౌలిక సదుపాయాల కల్పనకు టీజీఐఐసీ వినియోగించిందని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధి కోసం భూ కేటాయింపులు ఒక్కరోజులో చేసినవి కాదనీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇచ్చినవేనని చెప్పారు. ఆజమాబాద్, కూకట్‌పల్లి, హఫీజ్‌పేటల్లోని పరిశ్రమల భూములను ఫ్రీ హెహోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేన్నారు. దానికోసం 2023 ఆగస్టు 29 ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్, జీఓ ఎమ్ఎస్ 19, 20, 21 లను కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే జారీ చేశారని వివరించారు. తాము ఆ భూములకు కన్వర్షన్ అవకాశం మాత్రమే కల్పిస్తున్నామనీ, ఈనెల 17 న జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో ఇంపాక్ట్ ఫీజు నిర్ణయం జరిగింద న్నారు. 2023లో ఎన్నికలకు నాలుగు నెలల ముందు పారిశ్రామిక వాడల్లోని భూములకు ఫ్రీహెహోల్డ్ హక్కులు కల్పించినప్పుడు వారు ఎన్ని లక్షల కోట్లు వసూలు చేసు కున్నారో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రశ్నించారు. పరిశ్రమల యజమానులు హక్కుల పొందా లంటే రిజిస్ట్రేషన్ విలువపై 100 శాతం చెల్లించాలని, అవి చేతులు మారితే 200 శాతం ఫీజులు కట్టాలని లీజు భూములకు జీవోలు ఎవరిచ్చారని అడిగారు. అందరూ దరఖాస్తులు చేసుకుంటే

మిగితా 2వ పేజీలో

## రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ నుంచి భారత్ అవుట్

- సెమీ ఫైనల్లోనే ముగిసిన భారత్ ప్రయాణం

**బలగం టీవి, హైదరాబాద్**

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భారత 'ఏ' జట్టు పోరాటం సెమీ ఫైనల్లో ముగిసింది. శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత సెమీస్‌లో బంగ్లాదేశ్ 'ఏ' జట్టు సూపర్ ఓవర్‌లో భారత్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ముందుగా బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. ఓపెనర్ హబీబుర్ రహ్మాన్ ఐదు సిక్సర్లు, మూడు ఫోర్లతో 65 పరుగులు చేసి మెరిపించాడు. మరో ఓపెనర్ జీషాన్ ఆలమ్ వేగంగా 14 బంతుల్లో 26 పరుగులు జోడించాడు. చివర్లో ఎస్.ఎమ్. మాహ్బా అద్భుత ప్రదర్శనతో నిలిచాడు. కేవలం 18 బంతుల్లో ఆరు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 48 నాటౌట్ చేశాడు. యాసిర్ అలీ (17 నాటౌట్) కూడా రాణించడంతో బంగ్లాదేశ్ భారీ స్కోరు సాధించింది. భారీ లక్ష్యంతో బరిలో దిగిన భారత్ 'ఏ' జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 194 పరుగులు చేసి మ్యాచ్‌ను టై చేసింది.

మిగితా 2వ పేజీలో

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- మొయినాబాద్ పరిధిలో ఘటన

**బలగం టీవీ, హైదరాబాద్**

రాంగ్ రూట్ ప్రయాణం ఇద్దరి ప్రాణం తీసింది.. రాంగ్ రూట్‌లో వచ్చిన కారు.. నేరుగా వచ్చిన మరో కారును ఢీకొట్టింది. ఇద్దరు మృతి చెందారు.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన వంశీధర్‌రెడ్డి, ఆయన అత్త సుజాత, బంధువు రోజా డ్రైవర్ వెంకట్‌తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మొయినాబాద్‌లోని పెంటయ్య హోటల్ దగ్గరకు రాగానే.. హైదరాబాద్ నుంచి కేతిరెడ్డిపల్లి సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్‌లో ఫొటో షూట్ కోసం వెళ్తున్న ఓ కారు రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి వంశీధర్‌రెడ్డి కారును ఢీకొట్టింది. రాంగ్ రూట్‌లో వచ్చిన కారు డ్రైవర్ కరీమ్(37) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అదే కారులో ఉన్న లోకేష్(24)కు తీవ్ర గాయాలు కావడంతో భాస్కర్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. ఈ ప్రమాదంలో బాబురావు, అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే మరో కారులో ఉన్న వంశీధర్‌రెడ్డి, ఆయన అత్త సుజాత, బంధువు రోజా, డ్రైవర్ వెంకట్ కూడా గాయపడటంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వంశీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు..

- వేములవాడ ఏఎస్పీగా రుత్విక్ సాయి, జగిత్యాలకు శేషాద్రి రెడ్డి

వివరాలు 2వ పేజీలో

## తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు..

- వేములవాడ ఏఎస్పీగా రుత్విక్ సాయి, జగిత్యాలకు శేషాద్రి రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో పోలీసు శాఖలో భారీగా మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఆదేశాలు ఇచ్చింది. ఈ బదిలీల్లో పలువురు సీనియర్, జూనియర్ అధికారులు ఉన్నారు. ముఖ్యంగా, కీలకమైన ప్రాంతాలకు కొత్త అధికారులను నియమించారు.

వేములవాడ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా రుత్విక్ సాయి ఐపీఎస్ బదిలీ అయ్యారు. అలాగే, శేషాద్రి రెడ్డి ఐపీఎస్ ను జగిత్యాల జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు జగిత్యాల జిల్లాలో కీలక బాధ్యతలు అప్పగించారు. పోలీస్ శాఖలో పాలన పటిష్టత, సమర్థవంతమైన నిర్వహణ లక్ష్యంగా ఈ బదిలీలు జరిగాయని తెలుస్తోంది. బదిలీ అయిన అధికారులు వెంటనే తమ కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## పారిశ్రామికవేత్తలను బెదిరిస్తున్న కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

భూముల కన్వర్షన్ ఇంపాక్ట్ ఛార్జీల వల్ల రూ.4 వేల నుంచి రూ.5 వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని భావిస్తున్నామనీ, యాజమాన్య హక్కులు లేనివారు కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకోలేరని వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు రాష్ట్రంలో ఆర్థిక ఆరాచకత్వానికి పాల్పడి వెళ్లి పోతే, రెండేండ్లుగా దాన్ని సరిదిద్దుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న పరి శ్రమలను వెలుపలకు తరలిస్తామని మొదటి నుంచి చెప్తున్నా మన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షిం చేందుకు కొన్ని రాష్ట్రాలు ఎకరం భూమిని 99 పైసలకే కేటాయించి, 20 ఏండ్లపాటు విద్యుత్, పన్ను రాయితీలను ఇస్తున్నాయని చెప్పారు. కానీ తెలంగాణలో భూముల విలువ ఎక్కువ, లభ్యత తక్కువగా ఉన్నందున దానికి అనుగుణంగానే విధాన నిర్ణయాలు తీసుకుంటున్నామని వివరించారు.



## సబితమ్మ అనుచరుల చెరువుల కబ్జాలు హైడ్రాకు కనిపించటం లేదా..?

**బలగం టీవీ, హైదరాబాద్**

సబితమ్మ అనుచరులు చెరువులను కబ్జా చేసి ఫంక్షన్ హాల్ నిర్మాణం చేస్తే హైడ్రాకు కనిపించటం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మీర్ పేట్ చౌరస్తాలో జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లావణ్య ఆధ్వర్యంలో ఛాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కవిత మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రిగా చేసిన సబితమ్మ తన అనుచరులను కబ్జాలు ప్రోత్సహించేందుకు పని చేసినట్టుంది ఆరోపించారు. పేదలు చిన్న గుడిసె వేస్తే తొలగించే హైడ్రా మీర్ పేట్‌లో సబితమ్మ అనుచరులు కబ్జా చేస్తుంటే కనిపించటం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం వస్తే బతుకులు మారుతాయి అనుకుంటే ఏం మారలేదు రాష్ట్రం తప్ప అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అవుతున్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. అందుకే ప్రజల సమస్యలను వెలికి తీస్తూ పరిష్కారం కోసం ప్రశ్నించేందుకే జాగృతి జనం బాట పట్టమని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు చేయాలి తప్ప గెలిచినా 5 సంవత్సరాలు కాదని చెప్పారు. ఇప్పుడు ఎన్నికలు లేవని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలనీ డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై పోరాటం చేసేందుకు జాగృతి మీ ముందుకు వచ్చిందని మీ ఇంటి ఆడబిడ్డగా అందరు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి, కోలా శ్రీనివాస్, జాగృతి విద్యార్థి అధ్యక్షులు నవీన్, నాయకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ నుంచి భారత అవుట్

(మొదటి పేజీ తరువాయి)

ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ 18 బంతుల్లో 38, ప్రియాన్ష్ ఆర్య 44 (23 బంతుల్లో) పరుగులు చేసి మంచి ఆరంభం అందించారు. తర్వాత జితేశ్ శర్మ (33), నెహాల్ వధేరా 32 నాటౌట్ కూడా కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. టై తేలడంతో సూపర్ ఓవర్‌కు మ్యాచ్ వెళ్లింది. సూపర్ ఓవర్‌లో భారత్ 'ఎ' జట్టు సున్నాకే ఆలౌట్ కాగా, బంగ్లాదేశ్ అవసరమైన ఒక్క పరుగు తీసి ఫైనల్‌కు దూసుకెళ్లింది.

# దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్‌కు సీఎం కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించే వేగం అత్యంత అనుమానాస్పదంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. 7 రోజుల్లో దరఖాస్తులు, 7 రోజుల్లో ఆమోదాలు, 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ చేయమని చెప్పడం పై అనుమానం వ్యక్తం చేశారు. లక్షల కోట్ల విలువైన భూముల అంశంలోఎందుకీ తొందర? ఎందుకీ వేగవంతమైన ప్రక్రియ? అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరులు మరియు మధ్యవర్తులు ఇప్పటికే ఈ భూముల కోసం ముందస్తు ఒప్పందాలు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. పాలసీ ఆమోదం పొందడానికి ముందే డీల్స్ కుదిరాయని ఆయన తెలిపారు.

'కాంగ్రెస్ HILTPని ఏటీఎం గా మార్చిందని, ఈ పాలసీని కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా అభివర్ణించిన కేటీఆర్, హెచ్ఐఎల్‌టీపీ వెనుక ఉన్న ఉద్దేశం పట్టణాభివృద్ధి కాదని, ఎంపిక చేసిన కొద్దిమందిని పెద్దఎత్తున ధనవంతులుగా మార్చడమేనని అన్నారు. ముఖ్యమంత్రి పాలన కంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ముందు మూసీ నదీ తీరంలోని భూములు. తర్వాత మెట్రో రైలు భూములు. తర్వాత యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ భూములు. ఇప్పుడు 9,292 ఎకరాల పారిశ్రామిక భూములు. రేవంత్ దృష్టి కేవలం రియల్ ఎస్టేట్ మాత్రమే అని నిరూపించుకుంటున్నారని అన్నారు. ఆయన చుట్టూ భూ డీలర్లు ఉన్నారు. ఆయన సోదరులు, సన్నిహితులు ఇప్పటికే ఈ భూముల కోసం ఒప్పందాలు చేసుకున్నారు. అందుకే పాలసీని తొందరపెడుతున్నారు, అని కేటీఆర్ ఆరోపించారు.

**ప్రజల భూమిని చౌక ధరలకు అప్పగిస్తున్నారు..**

ఇందిరమ్మ ఇళ్లు, స్మశాన వాటికలకు కూడా స్థలం లేని హైదరాబాద్‌లో, ప్రభుత్వం ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లేదా స్మశాన వాటికలకు కూడా భూమి దొరకని నగరంలో, రేవంత్ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలనుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని, ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించాలని లేదా ముంబై మాదిరిగా బహిరంగ వేలం వేయాలని అన్నారు. దానికి బదులుగా, వారు రూ. 5 లక్షల కోట్లు దోచుకోవాలని, కనీసం రూ. 50,000 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత జేబులో వేసుకోవాలని చూస్తున్నారు, అని ఆయన ఆరోపించారు.

**పారిశ్రామికవేత్తలు, డెవలపర్‌లకు హెచ్చరిక..**

హెచ్ఐఎల్‌టీపీ కింద డీల్స్ కుదుర్చుకునే వారికి కేటీఆర్ నేరుగా హెచ్చరిక జారీ చేశారు. ఈ పాలసీ కింద భూమి కొనుగోలు చేసే పారిశ్రామికవేత్తలు భవిష్యత్తులో తీవ్రమైన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటారు, ఈ లావాదేవీలు నిలబడవని అన్నారు. ఆ భూమిని తిరిగి తీసుకుంటాం. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమబద్ధీకరణను రద్దు చేసి, తగిన చర్యలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. మేము పూర్తి స్థాయి విచారణ జరుపుతాము మరియు ఈ కుంభకోణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటాం. ఈ స్కామ్‌లో పాల్గొనే ఎవరినీ వదిలిపెట్టం,అని స్పష్టం చేశారు.

ఈ పాలసీని వెంటనే ఉపసంహరించుకోవాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీసం, ప్రభుత్వం 50% భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని, మిగిలిన 50% క్రమబద్ధీకరించాలి. కానీ కాంగ్రెస్ 100% భూమిని చౌక ధరలకు క్రమబద్ధీకరించాలని చూస్తోంది. ఇది ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. ముంబై లాంటి మెట్రో నగరాల్లో ఇలాంటి భూములను వేలం వేసి ప్రభుత్వం ప్రజల ఆస్తిని ప్రభుత్వ ఖజానాకు చేరుస్తుంటే%ొ% ఇక్కడ మాత్రం అప్పనంగా సంపూర్ణంగా ప్రైవేట్ వ్యక్తుల లబ్ది కోసం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారన్నారు.

ఈ అంశంపై స్పందించాలని కేటీఆర్ బీజేపీకి సవాల్ విసిరారు. బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, దీనిని వ్యతిరేకించాలి. మౌనంగా ఉంటే, కాంగ్రెస్, బీజేపీ కలిసిపోయాయని అర్థం, అని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాంగ్రెస్ రూ. 5 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని దోచుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇది అభివృద్ధి కాదు, ఇది పగటిపూట దోపిడీ అని కేటీఆర్? అన్నారు.

# ఫార్ములా-ఈ కేసులో అవినీతి ప్రస్తావనే లేదు

- కేటీఆర్‌పై కేసు రాజకీయ కక్ష
- ఫార్ములా-ఈ వల్ల రాష్ట్రానికి రూ. 700 కోట్ల పెట్టుబడులు
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలంగాణ భవన్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. కేటీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీలు కలసి రాజకీయ కక్షతో ప్రాసిక్యూషన్ అనుమతి తెచ్చుకున్నాయని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. ఫార్ములా%-%ఈ కార్ రేసింగ్ కేసులో ఎక్కడా అవినీతి అంశం లేదని, ఎఫ్ఐఆర్‌లో కూడా ఆ విషయంపై ఒక్క మాటా లేదని తెలిపారు. ఫార్ములా%-%ఈ ఈవెంట్ కొనసాగితే కేసీఆర్, కేటీఆర్‌లకు పేరు వస్తుందని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే ఆ కార్యక్రమాన్ని ఆపేశారని ఆరోపించారు.

క్రిశాంక్ మాట్లాడుతూ, ఫార్ములా%-%ఈ ఈవెంట్ కంపెనీ తనకు లంచం ఆఫర్ చేసిందని రేవంత్ రెడ్డి అసెంబ్లీలోనే ప్రకటించినప్పటికీ, ఏ దర్యాప్తు సంస్థకూ ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. అభద్రత భావంతోనే కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం కేసులు పెడుతోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. కేటీఆర్ అనేక భాషల్లో నైపుణ్యంగా మాట్లాడి, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ, భారత దేశాల గురించి గొప్పగా చెప్పగలడనిబీ అదే రేవంత్ రె%ుుఎ% కి అసహనంగా మారిందని పేర్కొన్నారు.

ఫార్ములా%-%ఈ ఈవెంట్ వల్ల రాష్ట్రానికి సుమారు ?700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని క్రిశాంక్ తెలిపారు. ఒకే ఈవెంట్‌తో ఈ స్థాయి పెట్టుబడులు వస్తే, మరిన్ని ఇలాంటి ఈవెంట్లు జరిగితే ఇంకా భారీ పెట్టుబడులు వచ్చేవని అన్నారు. అయితే రేవంత్ ప్రభుత్వం మాత్రం బోగస్ కంపెనీలతో పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకుంటోందని ఆరోపించారు. "మంకీమన్ బయో" అనే కంపెనీతో జూన్‌లో ?345 కోట్ల పెట్టుబడి ఒప్పందం కుదుర్చుకున్నా, ఆ కంపెనీ ఈ నెలలోనే కేవలం లక్ష రూపాయల మూలధనంతో రిజిస్టర్ అయిందని వెల్లడించారు. లక్ష రూపాయల కంపెనీతో వందల కోట్ల ఒప్పందం కుదరడమే అనుమానాస్పదమని, దీనిలో బ్లాక్ మనీని వైట్ చేయాలనే కుట్ర ఉన్న అవకాశం ఉందని, ఈ వ్యవహారంపై దర్యాప్తు అవసరమని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారం "పిలగాడు పుట్టక ముందే పదో తరగతి పాస్ అయినట్లుగా" ఉందని విమర్శిస్తూ, ఆ కంపెనీ వెనుక ఏ మంత్రి ఉన్నాడో ప్రభుత్వం స్పష్టంచేయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని జరిగిన ఫార్ములా%-%ఈ ఈవెంట్‌పై కాదు, బోగస్ పెట్టుబడి ఒప్పందాలపై కేసులు పెట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి తమ్ముడు జగదీశ్వర్ రెడ్డి కంపెనీతో గతంలో ఇలాంటి బోగస్ ఒప్పందాలు కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే గోది మీడియా, వాల్ష్ కర్రా వంటి సంస్థలతో కూడ రేవంత్ ప్రభుత్వం అనుమానాస్పద ఒప్పందాలు చేసుకుందని ఆరోపించారు.

క్రిశాంక్ మాట్లాడుతూ, కేటీఆర్ తెచ్చిన పెట్టుబడులతో ఏర్పడ్డ పరిశ్రమలు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు కనిపిస్తున్నాయని చెప్పారు. అయితే రేవంత్ రె%ుుఎ% తెచ్చిన పెట్టుబడులతో రాష్ట్రంలో ఎక్కడా పరిశ్రమలు కనిపించడం లేదని ప్రశ్నించారు. కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెడుతుంటే, బోగస్ ఒప్పందాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రేవంత్ మంత్రివర్గంపై కేసులు ఉండకూడదా? అని ప్రశ్నించారు. బోగస్ కంపెనీలపై ఈడీ, ఏసీబీ దర్యాప్తు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఈ పరిణామాలన్నీ గమనిస్తున్నారని క్రిశాంక్ అన్నారు.

## బెట్టింగ్ యాప్స్ కేసు దర్యాప్తు వేగవంతం

- నిధి అగర్వాల్, శ్రీముఖి, అమృతా చౌదరి విచారణ
- సీఐడీ సిట్ ఎదుట హాజరైన సినీ ప్రముఖులు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్ ప్రచారంపై నమోదైన కేసు దర్యాప్తును సీఐడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు సెలబ్రిటీలను సిట్ ఇప్పటికే విచారించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ విచారణలో విజయ్ దేవరకొండతో పాటు ప్రకాశ్ రాజ్, రానా తదితరులు హాజరయ్యారు. అయితే ఈ దర్యాప్తులో భాగంగా నటి నిధి అగర్వాల్ , యాంకర్ శ్రీముఖి, నటి అమృతా చౌదరి నేడు విచారణకు హాజరయ్యారు. శ్రీముఖి విచారణ ఇప్పటికే పూర్తికాగా.. నిధి అగర్వాల్, అమృత చౌదరిలను అధికారులు ప్రస్తుతం ప్రశ్నిస్తున్నారు. కొన్ని నెలల కిందట బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌ల అక్రమ కార్యకలాపాలపై లోతుగా దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం సీఐడీ సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ విచారణ ద్వారా యాప్‌ల నిర్వాహకులు, ప్రమోటర్ల పాత్రపై మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు అందిస్తాం..



- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- చందుర్తి, మల్యాలలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి శ్రీకారం
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, చందుర్తి**

అర్హులైన మహిళలందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలు అందజేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.చందుర్తి మండల కేంద్రంతోపాటు మల్యాల గ్రామంలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం రోజున నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పేరిట చీరలు పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో చీరలు పంపిణీ మొట్టమొదట మల్యాల గ్రామం ఎంపిక చేసుకున్నామని తెలిపారు. ఆకాశంలో సగం మహిళలు కాబట్టి ఆకాశంలో ఉన్న నీలి రంగు చీరలు సెలక్ట్ చేశామని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి చీరలు ఇస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో లక్ష 45 వేల మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సంఘాలలో లేని వారికి కూడా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంపు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు. స్వంత ఇంటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, జిల్లాలో నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు.

మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, చందుర్తి మండలంలోని స్వశక్తి మహిళలు ముందుకు వస్తే వారికి రైస్ మిల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మల్యాల గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బ్యాంకు మంజూరు చేశామని తెలిపారు. చందుర్తి-మోత్కురావుపేట రోడ్డు నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఇందిరా మహిళా చీరల ఉత్పత్తి ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సాధికారతకు ఉపయోగపడుతుందని, మహిళల ఆత్మగౌరవానికి తోడ్పడుతుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన మహిళలకు అందజేసే చీరలు జిల్లాలో ఉత్పత్తి కావడం ఎంతో సంతోషంగా ఉందని, 32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వంమహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. మహిళల ఆర్థిక ఉన్నతితో రాష్ట్ర ప్రగతి సాధ్యమనే ఉద్దేశ్యంతో ప్రతి ప్రభుత్వ పథకంలో వారిని భాగస్వామ్యులను చేస్తుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరిట ఇస్తుందని, కొనుగోలు కేంద్రాలు, ఇతర వ్యాపారాలకు అవకాశం కల్పించిందని తెలిపారు.

ఎస్ హెచ్ జీ ల్లో ప్రస్తుతం 18- 59 ఏండ్ల వారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 15-18 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని, ఇప్పటిదాకా 117 మందికి రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, ఐదుగురికి రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వెల్లడించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, తహసీల్దార్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

# కోనరావుపేట హెడ్ కానిస్టేబుల్ పరమేశ్వర్ కన్నుమూత..

- పోలీస్ శాఖ, మండల ప్రజల సంతాపం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కోనరావుపేట మండల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పరమేశ్వర్ గురువారం రోజున అనారోగ్య కారణాల వలన కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. పరమేశ్వర్ మృతి వార్త తెలుసుకున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, మరియు మండల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. గతంలో తంగళ్లపల్లిలో విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందిన ఆయన, కోనరావుపేటలో కూడా ప్రజలకు నిస్వార్థంగా సేవలందించారు. ఆయన విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, అంకితభావం ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. ఆయన మృతి పోలీస్ శాఖకు, ముఖ్యంగా కోనరావుపేట మండల ప్రజలకు తీరని లోటని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. పరమేశ్వర్ మృతి పట్ల జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర పోలీస్ అధికారులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి ఇవ్వాలని వారు ప్రార్థించారు.



# ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నిందితుడు అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- సిరిసిల్ల రూరల్ సి.ఐ మొగిలి

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసి, బస్సు అద్దాన్ని పగలగొట్టేందుకు యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పిట్ల శ్రీకాంత్ అనే వ్యక్తి కార్(TS 07 HJ 6969) కు తేదీ 19.11.2025 రోజున మధ్యాహ్నం సమయంలో ఇల్లంతకుంట నుండి సిరిసిల్ల వెళ్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సైడ్ ఇవ్వలేదనే కోపంతో ఈ దాడికి పాల్పడ్డాడు.

శ్రీకాంత్ కొంత దూరం వెళ్ళిన తర్వాత కారును వెనక్కి తిప్పుకొని వచ్చి ఆర్టీసీ బస్సుకు అడ్డుగా నిలిపాడు. అనంతరం బస్సు డ్రైవర్ కల్లూరి బాలరాజును దుర్భాషలాడి, డ్రైవింగ్ క్యాబిన్లోకి వచ్చి డ్రైవర్‌పై దాడి చేశాడు. అంతేకాక, బస్సు అద్దాన్ని పగలగొట్టడానికి రాయితో విసరగా, అది పగిలి రోడ్డు పక్కన కూర్చున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన సండి వజ్రవ్వ మోకాలిపై గాయం తగిలింది. ఈ ఘటనను ప్రశ్నించిన ఓబులాపూర్ గ్రామానికి చెందిన ప్రయాణికురాలు బత్తుల రాజవ్వతో కూడా నిందితుడు వాగ్వాదానికి దిగాడు. మొత్తం ఘటనను బస్సు కండక్టర్ తన మొబైల్ ఫోన్‌లో వీడియోగా రికార్డు చేయగా వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నిందితుడు శ్రీకాంత్ నిన్నటి నుండి పరారీలో ఉన్నాడు. దాడికి గురైన డ్రైవర్ బాలరాజు ఫిర్యాదు మేరకు నిన్న ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇల్లంతకుంట ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పాటయ్యాయి. సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈరోజు సాయంత్రం రహీంఖాన్ పేట గ్రామ శివార్లలో నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం అతడిని జ్యుడిషియల్ కస్టడీ నిమిత్తం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మొగిలి తెలిపారు.

# జిల్లా స్థాయి ఇన్నోవేషన్ మేళాలో జోగాపూర్ విద్యార్థికి ప్రథమ బహుమతి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నవంబర్ 20, 2025న జరిగిన జిల్లా స్థాయి ఇన్నోవేషన్ మేళా (జిల్లా స్థాయి నవకల్పనల ఉత్సవం)లో జోగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి బొల్లం శ్రీవిన్ ప్రథమ బహుమతిని గెలుచుకున్నాడు. శ్రీవిన్, తన గైడ్ టీచర్ మేడికాల అంజయ్య నేతృత్వంలో '»Sustainable Grain Separation Device for Small Farmers in Rural Areas%' (గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులకు ఉపయుక్తమైన సుస్థిర ధాన్యపు వేర్పాటు పరికరం) అనే ఆవిష్కరణను ప్రదర్శించాడు. ఈ యంత్రానికి ఉన్నత పాఠశాలల విభాగంలో »Sustainable Agriculture (సుస్థిర వ్యవసాయం)' అనే ఉప అంశంలో ఈ ప్రతిష్టాత్మక బహుమతి లభించింది. ప్రథమ బహుమతి కింద శ్రీవిన్‌కు రూ. 3,000/- నగదు పురస్కారం, జ్ఞాపిక మరియు ప్రశంసా పత్రం అందజేశారు.

**తక్కువ ఖర్చుతో ధాన్యం వేరుచేసే యంత్రం..**

ఈ సందర్భంగా గైడ్ టీచర్ అంజయ్య మాట్లాడుతూ.. "శ్రీవిన్ తయారుచేసిన ఈ యంత్రం ద్వారా వరి లేదా గోధుమ పంటల నుండి ధాన్యాన్ని చాలా సులువుగా వేరు చేయవచ్చు. నేటి రోజుల్లో హార్వెస్టర్ల ఖర్చులు అధికంగా ఉన్న నేపథ్యంలో, ఈ పరికరం చిన్న మరియు సన్నకారు రైతులకు తక్కువ ఖర్చుతో, తేలికగా పంటలను కుప్ప నూర్చడానికి" ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. శ్రీవిన్ విజయాన్ని పురస్కరించుకుని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రాజు, పాఠశాల కమిటీ చైర్ పర్సన్ లావణ్య, ఉపాధ్యాయులు మహేష్, జావిద్, గోవర్ధన్, శ్రీనివాస్, పద్మ, నరసయ్య, విద్యార్థిని, గైడ్ టీచర్ అంజయ్యను ఘనంగా అభినందించారు.



# సీఐటీయూ మహాసభల కరపత్రం పోస్టర్ విడుదల

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామంలో జిల్లా సిఐటియు 4వ మహాసభల కరపత్రం హమాలి కార్మికుల ఆధ్వర్యంలో శుక్రవారం రోజున పోస్టరు ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ.. ఈ మహాసభలకు ఈ జిల్లాలో పనిచేస్తున్నటువంటి అన్ని రంగాల శ్రామిక, కార్మిక వర్గం, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ యూనియన్ పిలుపునిచ్చారు. ఈనెల 30వ తేదీన జరిగే జిల్లా సిఐటియు 4వ మహాసభలకు ఈ జిల్లాలో ఉన్నటువంటి కార్మికులు, వ్యాపారవేత్తలు, బిజినెస్ దారులు, బిల్డర్లు, రైస్ మిల్ యాజమాన్యాలు, రియల్ ఎస్టేట్ దారులు, మేధావులు, మానవతవాదులు, ఆలోచన పరులు ఈ మహాసభలకు తోడ్పాటు అందించి ఆర్థిక సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులు రామిడి శ్రీనివాస్, ఎలగందుల తిరుపతి, బత్తుని కనకయ్య, పాతూరి వేణు, కొంపెల్లి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి అడ్డంగా చిక్కిన డిఈఇ



**బలగం టీవీ, జనగామ:**

జనగామ జిల్లా పాలకుర్తిలో అవినీతి నిరోధక శాఖ అధికారులు భారీగా దాడులు నిర్వహించారు. పాలకుర్తి మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కూనమల్ల సంధ్యారాణి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా చిక్కారు. వివరాల్లోకి వెళితే ఒక పని నిమిత్తం కాంట్రాక్టర్ లేదా లబ్ధిదారుడి నుంచి ఆమె రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. కూనమల్ల సంధ్యారాణి లంచం డబ్బులు తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు ఆమె కార్యాలయంలోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్న అధికారులు, ఆమె నుంచి లంచం డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంధ్యారాణిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



## ఈఎంఆర్ఎస్ ఛాంపియన్ తెలంగాణ విద్యార్థులకు సీఎం అభినందన..

- 4వ ఈఎంఆర్ఎస్ క్రీడల్లో తెలంగాణకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్.
- 230 పతకాలతో తెలంగాణ సత్తా: ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ మీట్ 2025.
- రూర్కేలాలో తెలంగాణ విద్యార్థుల క్రీడా విజయం.

**బలగం టీవీ, హైదరాబాద్**

4వ జాతీయ ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ స్పోర్ట్స్ మీట్ 2025 లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించిన తెలంగాణ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఒడిశాలోని రూర్కేలాలో నవంబర్ 11 నుంచి 15 వరకు జరిగిన ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ మీట్ 2025 లో అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, జూడో, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో, యోగా, షఉటింగ్, చెస్‌తో పాటు ఇతర ఈవెంట్లలో అన్ని రాష్ట్రాలకంటే అత్యధికంగా తెలంగాణ విద్యార్థులు రికార్డు స్థాయిలో 230 పతకాలు గెలిచి ఓవరాల్ ఛాంపియన్స్‌గా నిలిచారు.

ఈ జాతీయ క్రీడల్లో తెలంగాణలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని 23 పాఠశాలల నుంచి 580 విద్యార్థులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి 499 ఈఎంఆర్ఎస్ సంస్థలకు చెందిన 5,500 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఈ క్రీడల్లో నిర్వహించిన 22 ఈవెంట్లలో 15 వ్యక్తిగత ఈవెంట్లు, 7 జట్టు ఈవెంట్లు ఉన్నాయి. వాటిల్లో దాదాపు అన్ని విభాగాల్లో తెలంగాణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ క్రీడల్లో మొత్తంగా 230 పతకాలతో (88 బంగారు, 66 వెండి, 76 కాంస్య పతకాలు), 714 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుని తెలంగాణ కీర్తిని జాతీయ స్థాయిలో చాటారు. వీటిల్లో టీమ్ ఈవెంట్స్, వ్యక్తిగత ఈవెంట్లలోనూ తెలంగాణ విద్యార్థులు సత్తా చాటి అన్ని రాష్ట్రాలకన్నా అగ్రభాగాన నిలిచారు. EMRS Sports Meet2025 లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన నేపథ్యంలో విద్యార్థులు ముఖ్యమంత్రి ని కలిశారు. ముఖ్యమంత్రి విద్యార్థులను ప్రశంసిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కేటీఆర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులకు "గిఫ్ట్ ఎ స్మైల్" కింద దుప్పట్ల పంపిణీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




చలి కాలంలో దుప్పట్లు లేక ఇబ్బంది పడుతున్న సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల గుండెల్లో భరోసా, ఆదరణ నింపుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం కింద దుప్పట్లను పంపిణీ చేశారు. పత్రికలలో వచ్చిన కథనాలపై వెంటనే స్పందించిన కేటీఆర్, చలిలో బాధపడుతున్న విద్యార్థులకు అండగా నిలవాలని పార్టీ నాయకులను ఆదేశించారు. దీనిలో భాగంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మొత్తం 1200 దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ మానవతా కార్యక్రమాన్ని చల్మెడ లక్ష్మి నరసింహ రావు, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్ గార్ల నాయకత్వంలో విజయవంతంగా నిర్వహించారు. చలి తీవ్రత నుంచి విద్యార్థులకు ఉపశమనం కల్పించడంతో పాటు, "మేమున్నాం%ా% మీరు ఒంటరి కాదు" అనే భరోసాను వారికి అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అధికారంలో ఉన్నా–లేకున్నా, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేటీఆర్ చూపించిన ఈ చిన్న చిన్న శ్రద్ధ నిజమైన పాలనకు నిదర్శనంగా నిలిచిందని పార్టీ శ్రేణులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసించారు. చలిలో కేవలం దుప్పటిని మాత్రమే కాకుండా, మానవత్వాన్ని పరుస్తూ చేపట్టిన ఈ 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం విద్యార్థుల ముఖాలపై చిరునవ్వును తీసుకొచ్చింది, వారి హృదయాలలో చిరస్మరణీయమైన రోజుగా నిలిచింది.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేద విద్యార్థులు పడుతున్న కష్టాలను గుర్తించి, చలి తీవ్రత నుంచి వారికి ఉపశమనం కలిగించే లక్ష్యంతో ఈ మానవీయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన ఆదేశాల మేరకు, శుక్రవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ హాస్టళ్లకు వెళ్లి విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమం ద్వారా హాస్టల్ విద్యార్థులు చలి నుంచి ఉపశమనం పొందుతూ, సంతోషం వ్యక్తం చేశారు. కేటీఆర్ చొరవకు, బీఆర్ఎస్ నాయకుల సహాయానికి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి





- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని
- అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్, హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే హాజరయ్యారు.

గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, శాంతిభద్రతల అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ.. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ శర్ఫుద్దీన్, డిప్యూటీ జడ్పీ సీఈవో గీత తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో పకడ్బందీగా విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలి..

- వార్షిక తనిఖీల్లో భాగంగా తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే

**బలగం టీవీ, తంగళ్లపల్లి**



ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, గ్రామీణ ప్రాంతాలలో విజిబుల్ పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం రోజున ఆయన తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఎస్పీ ముందుగా స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వివరాలను, స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ భౌగోళిక మ్యాప్‌ను పరిశీలించి, క్రైమ్ హాట్‌స్పాట్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను సమగ్రంగా రివ్యూ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై సవివరంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పెట్రోలింగ్ సమయంలో సిబ్బంది, అధికారులు వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా చేయాలని సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై కొత్తగా రౌడీషీట్‌లను ఓపెన్ చేయాలని ఆదేశించారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుండే తగిన కార్యాచరణ ప్రారంభించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని క్రిటికల్, నాన్ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి. ముందస్తు సమాచారం సేకరించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై నిఘా కఠినతరం చేయడంతో పాటు, వాటి వలన కలిగే అనర్థాలపై ప్రజలకు, యువతకు చైతన్యం కల్పించాలని, సైబర్ నేరాల నియంత్రణపై కూడా చైతన్యపరచాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రతి రోజు విస్తృతంగా వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట సిరిసిల్ల రూరల్ సి.ఐ మొగిలి, ఎస్.ఐ ఉపేందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హుజురాబాద్ అభివృద్ధికి సహకరించండి..




**బలగం టీవీ, హుజురాబాద్:**

కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై సమగ్రంగా చర్చించారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి తగిన బడ్జెట్ వెంటనే కేటాయించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా ఇల్లంతకుంట మండలం లో పూర్తిగా ధ్వసం ఇన రాచపల్లి నుండి బూజునూర్ గ్రామం వెళ్లే రోడ్డు మరియు నాగంపేట నుండి రాచపల్లి వెళ్లే రోడ్డు మరియు రాచపల్లి బ్రిడ్జ్ కూడా పూర్తి స్థాయి లో కుంగిపోయింది అని వెంటనే వీటికి నిధులు మంజూరు చెయ్యాలని కోరారు మరియు ఇతర ప్రధాన రహదారులు, కాల్వల ప్రాజెక్ట్ నిర్మాణం, శాశ్వత మౌలిక వసతులు హుజురాబాద్ స్కూల్ గ్రౌండ్ వంటి పలు కీలక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, వీటి గురించి గత అసెంబ్లీ సమావేశాల్లో కూడా వివరంగా చెప్పినట్లు గుర్తుచేశారు. హుజురాబాద్ సమగ్ర అభివృద్ధి కోసం కనీసం వెయ్యి కోట్ల నిధులను మంజూరు చేసి, అనుమతులు పొందిన పనులు సహా పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థనలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్వీకరించి, వెంటనే రాచపల్లి నుండి బూజునూర్ గ్రామం వెళ్లే రోడ్డు మరియు నాగంపేట నుండి రాచపల్లి వెళ్లే రోడ్డు మరియు రాచపల్లి బ్రిడ్జ్ కి నిధులు మంజూరు చేస్తాం అని మరియు హుజురాబాద్ అభివృద్ధికి అవసరమైన నిధులు మరియు సహకారం అందిస్తాం అని హామీ ఇచ్చారు.